TGTEL/26/A5513

వార్తా దీపిక

ప్రచురణ :సంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 59 | 28 బుధవారం అక్టోబర్ 2026 | వెల: 02 | పేజీలు:04

అర్ణబ్ తుపాను ప్రభావం: పలు రైళ్లు రద్దు చేసిన దక్షిణ మధ్య రైల్వే

అర్ణబ్ తుపాను కారణంగా రైళ్ల రాకపోకల పై తీవ్ర ప్రభావం ప్రయాణికుల భద్రత దృష్ట్యా పలు రైళ్లను రద్దు చేసిన దక్షిణ మధ్య రైల్వేఅక్టోబర్ 27, 28 తాపాక్షికంగా రద్దుసికింద్రాబాద్, హైదరాబాద్ నుంచి వెళ్లే పలు కీలక సర్వీసులైన స్టేఖాతంలో ఏర్పడిన 'అర్ణబ్' తుపాను ప్రభావంతో దక్షిణ మధ్య రైల్వే అప్రమత్తమైంది. తుపాను కారణంగా ప్రయాణికుల భద్రతకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ఉండేందుకు ముందుజాగ్రత్త చర్యగా పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. నేడు, రేపు (అక్టోబర్ 27, 28) పలు రైలు సర్వీసులను పూర్తిగా రద్దు చేయగా, ఓ రైలును పాక్షికంగా రద్దు చేస్తున్నట్లు మంగళవారం ఒక పత్రికా ప్రకటనలో వెల్లడించింది. ఈ మేరకు రద్దయిన రైళ్ల జాబితాను కూడా విడుదల చేసింది.

కేటీఆర్, హరీశ్ రావు భ్రమల్లో ఉన్నారు

- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లు గెలుస్తుందని మహేశ్ గౌడ్ ధీమా
- తెలంగాణలో బీజేపీ పని అయిపోయిందని వ్యాఖ్య
- ఆలోచన లేకుండా అప్పులు చేసి కేసీఆర్ రాష్ట్రాన్ని ముంచారని ఆరోపణ



బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావు ఇంకా భ్రమల్లోనే జీవిస్తున్నారని, క్షేత్రస్థాయి వాస్తవాలను వారు గ్రహించడం లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రంగా విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లు గెలుచుకోవడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.మేధావి అని చెప్పుకునే కేసీఆర్ ఎలాంటి ఆలోచన లేకుండా అప్పులు చేశారని మహేశ్ గౌడ్ విమర్శించారు. ఎల్ నినో ప్రభావం దేశవ్యాప్తంగా ఉంటే, దాని గురించి హరీశ్ రావు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, 90,000 ఉద్యోగాలు పొందిన ప్రతి లబ్ధిదారుడు కాంగ్రెస్‌కే ఓటు వేస్తారని...

...మిగతా 2 లో...

తెలంగాణ సీనియర్ ఐఏఎస్ కీలక నిర్ణయం..

వీఆర్ఎస్‌కు దరఖాస్తు

- వీఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న జయేశ్ రంజన్
- దరఖాస్తుపై నిర్ణయం తీసుకోవాల్సిన కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం
- ప్రస్తుతం పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు
- ఉమ్మడి ఏపీలో పలు జిల్లాలకు కలెక్టర్‌గా సేవలు
- తెలంగాణ ఐటీ, పరిశ్రమల రంగాల్లో కీలక పాత్ర



తెలంగాణ సీనియర్ ఐఏఎస్ అధికారి జయేశ్ రంజన్ స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆయన నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



రాష్ట్రం పిచ్చోడి చేతిలో రాయిలా మారింది: కేటీఆర్

- ప్రభుత్వమే కృత్రిమ కరవు సృష్టిస్తోందని కేటీఆర్ ఆరోపణ
- గోదావరిలో నీళ్లున్నా ఎత్తిపోయడం లేదని విమర్శ
- మరో ఏడాదిన్నరలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని వ్యాఖ్య

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గోదావరిలో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ, వాటిని ఎత్తిపోయకుండా ఉద్దేశపూర్వకంగానే రాష్ట్రంలో కరవు పరిస్థితులను సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం రైతులను వరి వేయవద్దని చెప్పడాన్ని తప్పుబట్టారు.

...మిగతా 2 లో...

ఈటల రాజేందర్ పాదయాత్రకు బ్రేక్...

అనుమతి నిరాకరించిన పోలీసులు

- జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ తరలింపు డిమాండ్‌తో యాత్రకు పిలుపు
- ఘట్‌కేసర్ మండలం ఏదులాబాద్‌లో ప్రారంభానికి ముందే ఉద్రిక్తత
- ఎంపీగా తన నియోజకవర్గంలో పర్యటించే హక్కు ఉందన్న ఈటల
- గతంలో ఇదే అంశాన్ని సీఎం రేవంత్ ప్రస్తావించారని గుర్తు చేసిన బీజేపీ ఎంపీ



మల్కాజ్‌గిరి ఎంపీ, భారతీయ జనతా పార్టీ నేత ఈటల రాజేందర్ తలపెట్టిన "మహా పాదయాత్ర"కు పోలీసులు అనుమతి నిరాకరించారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను తరలించాలనే ప్రధాన డిమాండ్‌తో ఈరోజు ఉదయం ఈ యాత్ర ప్రారంభం కావాల్సి ఉండగా, చివరి నిమిషంలో పోలీసులు అనుమతి నిరాకరించడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, ఘట్‌కేసర్ మండలం ఏదులాబాద్ నుంచి నాలుగు రోజుల పాటు ఈ పాదయాత్ర జరగాల్సి ఉంది. ఇందులో భాగంగా ఈటల రాజేందర్ ఉదయాన్నే ఏదులాబాద్ చేరుకుని, స్థానిక రంగనాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 5,000 మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి యాత్రను ప్రారంభించేందుకు సిద్ధమవుతుండగా, పోలీసులు ఆయనను అడ్డుకున్నారు. పోలీసుల చర్యపై ఈటల రాజేందర్ తీవ్రంగా స్పందించారు. తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పర్యటించి, ప్రజల సమస్యలను తెలుసుకునే హక్కు తనకుందని ఆయన స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారమే మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్‌కు లేఖ రాసి అనుమతి కోరినట్లు వెల్లడించారు. గతంలో ఎంపీగా ఉన్నప్పుడు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం ఇదే జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై పార్లమెంటులో మాట్లాడారని ఈటల గుర్తుచేశారు. నాడు రేవంత్ రెడ్డి లేవనెత్తిన అంశంపైనే ఇప్పుడు తాను పాదయాత్ర చేస్తుంటే ఎందుకు అడ్డుకుంటున్నారని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు.పోలీసుల అనుమతి నిరాకరణ నేపథ్యంలో పాదయాత్ర ముందుకు సాగుతుందా? లేదా? అనే దానిపై అనిశ్చితి నెలకొంది. ఈ క్రమంలో ఏదులాబాద్‌లో ప్రస్తుతం ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది.



గ్రావిటీతో నీళ్లిస్తే రాజీనామా చేస్తా: ప్రభుత్వానికి హరీశ్‌రావు సవాల్

- తుమ్మిడిహెట్టి నుంచి గ్రావిటీతో నీళ్లు తెస్తే రాజీనామా చేస్తానన్న హరీశ్
- ప్రస్తుత కరవు కాంగ్రెస్ తెచ్చిన కరవు అని విమర్శ
- తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు డీపీఆర్‌ను బహిర్గతం చేయాలని డిమాండ్

తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులపై అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి గ్రావిటీ ద్వారా నీటిని తరలించడం సాధ్యమని నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని, ఒకవేళ నిరూపించలేకపోతే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాజీనామా చేస్తారా?

...మిగతా 2 లో...

భారత చమురు కొనుగోళ్లపై అమెరికా ఒత్తిడి?

కేంద్రం కీలక ప్రకటన!

- రష్యా చమురు దిగుమతులపై అమెరికా ఒత్తిడి లేదన్న హర్దీప్ పురి
- యుద్ధానికి ముందు రష్యా చమురుపై భారత్ ఆధారపడింది 0.2 శాతమే
- రాయితీల కారణంగా యుద్ధం తర్వాత పెరిగిన రష్యా చమురు కొనుగోళ్లు
- సెప్టెంబర్‌లో పెరిగిన మధ్యప్రాచ్య చమురు దిగుమతులు
- గల్ఫ్ చమురుపై రాయితీలతో తగ్గిన రష్యా దిగుమతులు
- దేశ ప్రయోజనాలే కొనుగోళ్లలో కీలకమన్న కేంద్రం మంత్రి



రష్యా నుంచి ముడి చమురు దిగుమతులను తగ్గించాలంటూ అమెరికా తమపై ఎలాంటి ఒత్తిడి చేయలేదని కేంద్రు దిగుమతులు ఉక్రెయిన్ యుద్ధానికి ముందు చాలా తక్కువగా ఉండేవని పురి గుర్తుచేశారు. అప్పట్లో దేశ చమురు దిగుమతుల్లో రష్యా వాటా కేవలం 0.2 శాతమేనని చెప్పారు. యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యా చమురుపై లభించిన రాయితీల కారణంగా దిగుమతులు పెరిగాయని వివరించారు.

...మిగతా 2 లో...

'బ్రేకింగ్ బ్యాడ్' తర్వాత ఇప్పుడు 'ప్రిజన్ బ్రేక్':

విజయ్ ప్రభుత్వంపై స్టాలిన్ విమర్శలు

- తేని జైలు నుంచి 17 మంది విచారణ ఖైదీలు పరారీ కావడంతో దుమారం

తమిళనాడులోని తేని జిల్లాలో జరిగిన జైలు ఘటనపై డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్, అధికార టీవీకే ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

...మిగతా 2 లో...



ఎస్ఐఆర్‌పై సుప్రీంకోర్టు విచారణ.. రాహుల్ గాంధీ పోస్టులో

'సత్యం శివం సుందరం'

- ఎస్ఐఆర్ విచారణకు ముందు రాహుల్ గాంధీ శివుడి చిహ్నంతో పోస్ట్
- 'సత్యం శివం సుందరం' అనే పదాలను జోడించిన కాంగ్రెస్ అగ్రనేత
- ఓటర్ల జాబితా సవరణపై ప్రతిపక్షాల అభ్యంతరాలు
- అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించే ప్రమాదముందని పిటిషనర్ల ఆరోపణ
- ఎన్నికల సంఘం నిర్ణయాలపై న్యాయ సమీక్ష కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్
- ఎస్ఐఆర్ నిర్ణయాలు ఏకగ్రీవంగా తీసుకున్నామని ఎన్నికల సంఘం వాదన



ఓవైపు ఓటర్ల జాబితా సవరణపై రాజకీయ పోరు.. మరోవైపు సుప్రీంకోర్టులో కీలక విచారణ. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన ఓ సోషల్ మీడియా పోస్ట్ చర్చనీయాంశమైంది. 'సత్యం శివం సుందరం'ని కోరుతూ వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే ఈ ఆరోపణలు ఇంకా న్యాయస్థానంలో విచారణలోనే ఉన్నాయి. ఎన్నికల సంఘం ఏం చెప్పింది? ఎస్ఐఆర్‌కు సంబంధించిన నిర్ణయాలన్నీ ఎన్నికల సంఘం ఏకగ్రీవంగానే తీసుకుందని కమిషన్ సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో తెలిపింది. మరోవైపు, ఈ నిర్ణయాలపై తమ అభ్యంతరాలను పరిశీలించాలని పిటిషనర్లు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు విచారణపై ఆసక్తి నెలకొంది.

TGTEL/26/A5513 వార్త దీపిక

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు రెచిని విద్యార్థిని అక్షర ఎంపిక

వార్త దీపిక న్యూస్



క్రీడారంగంలో ప్రతిభను చాటుకుంటూ తాండూరు మండలం రెచిని గ్రామానికి చెందిన విద్యార్థిని గిరుగుల అక్షర రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. రెచిని గ్రామంలోని పి.ఎం.శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న అక్షర పాఠశాల క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కించుకుంది. ఈ విషయాన్ని పాఠశాల శారీరక విద్యా ఉపాధ్యాయుడు నిట్టూరి సంతోష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు మెదక్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో అక్షర పాల్గొననుంది. ఈ పోటీల్లో తన ఆటతీరుతో ఆకట్టుకొని విజయం సాధించడంతో పాటు జిల్లాకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. క్రీడల్లో విద్యార్థులు రాణించేందుకు పాఠశాల స్థాయిలో ప్రోత్సాహం, సరైన శిక్షణ ఎంతో అవసరమని ఈ ఎంపిక మరోసారి చాటిచెబుతోంది.విద్యార్థిని అక్షర రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మసాడే ప్రదీప్, గ్రామ సర్పంచ్ రామ్‌బాయి, ఉపసర్పంచ్ కోడిపాక భీమయ్య, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షురాలు నాగమణి, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు. అక్షరను అభినందించి రాష్ట్రస్థాయి పోటీల్లో మరింత ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థిని సాధించిన ఈ అవకాశం ఇతర విద్యార్థులకు కూడా స్ఫూర్తినివ్వాలని వారు పేర్కొన్నారు.

తెలంగాణ సీనియర్ ఐపీఎస్ కీలక నిర్ణయం..

వీఆర్ఎస్‌కు దరఖాస్తు

మొదటిపేజీ తరువాయి

అయితే, ఈ దరఖాస్తుపై కేంద్ర సిబ్బంది శిక్షణ వ్యవహారాల శాఖ (డీఓపీటీ), రాష్ట్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం పరిశీలించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.ప్రస్తుతం జయేశ్ రంజన్ తెలంగాణ ప్రభుత్వంలో మెట్రోపాలిటన్ ప్రాంత, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. యూత్ అడ్వాన్స్‌మెంట్, పర్యాటక, సాంస్కృతిక, క్రీడల శాఖలకు సంబంధించిన అదనపు బాధ్యతలు కూడా చూస్తున్నారు.1992 బ్యాచ్‌కు చెందిన జయేశ్ రంజన్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పలు కీలక పదవుల్లో పనిచేశారు. వైఎస్సార్ కడప, గుంటూరు, మెదక్ జిల్లాల కలెక్టర్‌గా సేవలందించారు. హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ ఛైర్మన్‌గా, ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరించారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య రంగాల అభివృద్ధిలో కీలక బాధ్యతలు నిర్వహించారు. హైదరాబాద్‌లో టీ-హబ్ ఏర్పాటు, ఐటీ రంగానికి సంబంధించిన విధానాల రూపకల్పనలో ముఖ్య పాత్ర పోషించారు. పరిశ్రమలకు పెట్టుబడులను ఆకర్షించే కార్యక్రమాల్లోనూ పనిచేశారు.ఈ ఏడాది ప్రభుత్వంలోని కీలక బాధ్యతలు చేపట్టిన ఆయన.. పదవీకాలం ముగియడానికి ముందే వీఆర్ఎస్ కోరడం ప్రాధాన్యం సంతరించుకుంది. సాధారణంగా 2027 సెప్టెంబర్ 30న పదవీ విరమణ చేయాల్సి ఉండగా, ఏడాది ముందుగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

భారత చమురు కొనుగోళ్లపై అమెరికా ఒత్తిడి?

కేంద్రం కీలక ప్రకటన!

మొదటిపేజీ తరువాయి

అయితే, ఇటీవల పరిస్థితుల్లో మార్పు కనిపిస్తోందని మంత్రి తెలిపారు. మధ్యప్రాచ్య దేశాల నుంచి చమురు సరఫరాలు పెరుగుతున్నాయని, ఆ ప్రాంతం నుంచి మరింత చమురు సరఫరా అవుతుందని పేర్కొన్నారు. సెప్టెంబర్‌లో మధ్యప్రాచ్య దేశాల నుంచి భారత్ దిగుమతులను పెంచుకుంది. అదే సమయంలో చైనా నుంచి పోటీ పెరగడం, గల్ఫ్ దేశాల చమురుపై రాయితీలు లభించడంతో భారత రిఫైనరీలు రష్యా చమురు కొనుగోళ్లను తగ్గించినట్లు నౌకల రవాణా గణాంకాలు వెల్లడించాయి.రష్యా చమురు కొనుగోళ్లు ఇతర దేశాల చమురు ధరలతో పోలిస్తే ఎంత రాయితీ లభిస్తుందనే అంశంపై ఆధారపడి ఉంటాయని పురి తెలిపారు. "చివరకు ప్రతి నిర్ణయం దేశ ప్రయోజనాల ఆధారంగానే తీసుకుంటాం" అని ఆయన పేర్కొన్నారు.మరోవైపు, రష్యా ఇంధన ఎగుమతులపై కొత్త ఆంక్షలు, సుంకాల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అక్టోబర్‌లో జాతీయ ప్రయోజనాల నిబంధనల కింద మినహాయింపులు ఇచ్చారు. దీంతో భారత్‌పై విధించే అవకాశం ఉన్న భారీ సుంకాల నుంచి కొంత ఉపశమనం లభించింది.భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల మధ్య కూడా భారత్ ఇంధన సరఫరాలను స్థిరంగా కొనసాగించిందని పురి గతంలో పేర్కొన్నారు. రాబోయే రెండు దశాబ్దాల్లో ప్రపంచ ఇంధన డిమాండ్ పెరుగుదలలో దాదాపు నాలుగో వంతు భారత్ నుంచే ఉంటుందని ఆయన తెలిపారు.

'బ్రేకింగ్ బ్యాడ్' తర్వాత ఇప్పుడు 'ప్రిజన్ బ్రేక్':

మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆరోపిస్తూ, ప్రముఖ వెబ్ సిరీస్‌ల పేర్లతో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో 'బ్రేకింగ్ బ్యాడ్' తర్వాత ఇప్పుడు 'ప్రిజన్ బ్రేక్' మొదలైందని ఆయన ఎద్దేవా చేశారు.తేని జిల్లాలోని తెక్కంపట్టి సబ్ జైలు నుంచి నిన్న రాత్రి 17 మంది విచారణ ఖైదీలు పరారైన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ నేపథ్యంలో స్పందించిన స్టాలిన్... సీఎం విజయ్ పరిపాలన వైఫల్యంపై విమర్శలు చేశారు. "బ్రేకింగ్ బ్యాడ్ తర్వాత ఇప్పుడు తమిళనాడులో ప్రిజన్ బ్రేక్ కూడా మొదలైంది. బెయిల్‌పై బయటకు వచ్చిన వారినే పర్యవేక్షించడం లేదనుకున్నా. కానీ ఈ చేతకాని ప్రభుత్వ హయాంలో జైళ్లలో ఉన్న ఖైదీలు కూడా సులభంగా తప్పించుకుంటున్నారు" అని ఆయన వ్యాఖ్యానించారు.1995 తర్వాత ఇంత పెద్ద సంఖ్యలో ఖైదీలు తప్పించుకోవడం ఇదే మొదటిసారని స్టాలిన్ గుర్తుచేశారు. ఈ ప్రభుత్వం ప్రజలను రక్షించలేదని, ప్రజలకు స్వీయరక్షణే శరణ్యమని ఆయన అన్నారు. ఇటీవల టీవీకే పార్టీ నేత ఒకరు నార్కోటిక్స్ కేసులో పట్టుబడినప్పుడు స్టాలిన్ ఆ పార్టీని 'బ్రేకింగ్ బ్యాడ్ పార్టీ' అని విమర్శించిన విషయం తెలిసిందే.తేని జైలు ఘటనలో, ఓ ఖైదీకి మూర్ఛ వచ్చిందని నమ్మించిన ఖైదీలు, సెల్‌లోకి వచ్చిన గార్డులపై దాడి చేసి పరారయ్యారు. ఈ ఘటన తర్వాత అప్రమత్తమైన పోలీసులు, పరారైన వారిని పట్టుకోవడానికి 17 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు నలుగురు ఖైదీలను తిరిగి అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనకు బాధ్యులుగా తొమ్మిది మంది జైలు సిబ్బందిని సస్పెండ్ చేశారు. ముఖ్యమంత్రి విజయ్ వద్దే హోం శాఖ ఉండటంతో, విపక్షాల విమర్శలకు ఆయన నేరుగా సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ చాటిన ఆసిఫాబాద్ విద్యార్థినులు

విజేతలను సన్మానించిన జిల్లా కలెక్టర్ హరిత

వార్త దీపిక న్యూస్

హైదరాబాద్ సరూర్ నగర్ లో ఈ నెల 14 నుండి 17 వరకు నిర్వహించిన తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల ఖో ఖో ఛాంపియన్ షిప్ లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించి విజేతగా నిలువగా, అందులో ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన తెలంగాణ సంక్షేమ నమూనా క్రీడా పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటారని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు.మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో విజేత క్రీడాకారిణులను సన్మానించి అభినందించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఛాంపియన్ షిప్ పోటీలలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టులో తెలంగాణ సంక్షేమ నమూనా క్రీడా పాఠశాల బాలికలు ఆసిఫాబాద్ కు చెందిన 10 మంది క్రీడాకారిణులు ప్రాతినిధ్యం వహించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఖేలో ఇండియా పోటీలలో క్రీడా పాఠశాల విద్యార్థినులు 7 మంది ఎంపిక కావడం అభినందనీయమని అన్నారు. రాబోయే పోటీలలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి బంగారు పతకం సాధించాలని ఆకాంక్షించారు.క్రీడలలో



విద్యార్థినులు సాధిస్తున్న విజయాలు పాఠశాలకు గర్వకారణమని, క్రమశిక్షణ, నిరంతర సాధన, శిక్షకుల మార్గదర్శకత్వంతో మరిన్ని విజయాలు సాధించాలని, భవిష్యత్తులో మరిన్ని రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు అంబాజీ, పాఠశాల శారీరక సంచాలకులు మీనా రెడ్డి, శిక్షకులు తిరుమల్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జనగామ గ్రామ సమస్యలను పరిష్కరిస్తానను

ఆర్ జీవన్ జీఎం లలిత్ కుమార్

వార్త దీపిక న్యూస్ :

సింగరేణి ప్రభావిత జనగామ గ్రామం లో ఈ రోజు సింగరేణి RG 1 జిఎం లలిత్ కుమార్ ,సివిల్ డీజీఎం వరప్రసాద్, జనరల్ మేనజర్ I F రమేష్, వర్క్ షాప్ డీజీఎం జితేందర్ సింగ్, గ్రూప్ 1 ఏజెంట్ రమేష్, SSO మురళి మోహన్ తోపాటు స్థానిక కార్పొరేటర్ తోకల శ్యామణి రమేష్ మరియు గ్రామ నాయకులు గ్రామం లో ఉన్న సమస్యలు ప్రత్యేక్షంగా గ్రామం మొత్తం తిరిగి సమస్యలు పరిశీలించటం జరిగింది వీటిలో యుద్ధప్రాతిపతకన పనులు చేస్తామని హామీ ఇవ్వటం జరిగిందిముందు జనగామ గ్రామ కమాన్ నుండి ఊరు వరకు సోలార్ లెట్లు ఏర్పాటు చెయ్యాలని, జిఎం కాలనీ మోరి దగ్గర ఉన్న చెత్త మరియు రోడ్డు మీద పరుతున్న నీళ్లు, రైతులకు కాలువ ల ద్వారా నీళ్లు రావటం లేదు అని వివరిచటం జరిగింది, గ్రౌండ్ లో ఓపెన్ జిమ్, గ్రౌండ్ నుండి బైపాస్ రోడ్డు, చెరువు దగ్గర కాలువ హైట్ లేపుట, చెరువు కట్ట వేడెల్పు చేసి మెటల్ రోడ్డు, చెరువు పూడిక తీత, ఐకేపీ లో మట్టి తో లేవలింగ్, స్మశాన వాటికలో షెడ్డు, గోదావరి రోడ్డు కి కల్వర్ట్, రామాలయం, మహమ్మాయి, హనుమాన్ దేవాలయం, శివాలయం కు మండపాలు, స్కూల్ లో పిల్లలు కు ఉయ్యాల, జారుడు బండ, ఎల్లమ్మ దగ్గర కుంట కాడ స్లాబ్ కల్వర్ట్ ఇంకా పలు సమస్యలు చూయించటం జరిగింది ఈ కార్యక్రమం లో రుద్రభట్ల వామన్ రావు, అర్కూటీ శంకర్, రుద్రభట్ల నారాయణ, కలవేనా రవీందర్, జువ్వాడి విజయ్ రావు,జనగామ చంద్రయ్య,జనగామ మహేందర్, అడబాత్తుల మల్లేష్, జనగామ రాయలింగ్, మారం వెంకటేష్, =ఖ నేత, గోలివాడ రాజబాబు, బొడ్డు రవి,సోన్నాయిల అశోక్, జనగామ శివ, బొమ్మేర అమర్,మేకల నాగరాజు,గుండెబోయిన సదన్ కుమార్, అర్కూటీ రాజయ్య,వీరవేనా ప్రశాంత్, తదితరులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై పిటిషన్లు.. ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు నోటీసులు

తదుపరి విచారణ నవంబర్ 17కు వాయిదా

ఈసీ అఫిడవిట్‌పై స్పందనకు పిటిషనర్లకు రెండు వారాల గడువు

ఫారం-6లో మార్పులపై విచారణలో వాదనలు

'సర్' నిర్ణయాలు ఏకగ్రీవమని ఈసీ వివరణ

ఓటర్ల జాబితా నిర్వహణపై పిటిషన్లలో అభ్యంతరాలు

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ పనితీరును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు భారత ఎన్నికల సంఘానికి (ఈసీ) నోటీసులు జారీ చేసింది. ఈ పిటిషన్లపై సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను నవంబర్ 17కు వాయిదా వేసింది.సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చి, వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లను విచారించింది. ఎన్నికల సంఘం దాఖలు చేసిన అఫిడవిట్‌పై తమ స్పందన తెలియజేసేందుకు పిటిషనర్లకు రెండు వారాల గడువు ఇచ్చింది.విచారణ సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ దోలా సేన్ తరఫున సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి వాదనలు వినిపించారు. కొత్త ఓటర్ల నమోదు కోసం ఉపయోగించే ఫారం-6లో మార్పులకు సంబంధించి ఎన్నికల సంఘం వ్యవహరించిన తీరుపై ఆమె అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఫారం-6లో మార్పులకు సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చినట్లు ఈసీ పత్రికా ప్రకటనలో పేర్కొందని ఆమె ఆరోపించారు. దీనిపై స్పందించిన ప్రధాన న్యాయమూర్తి.. పరిశీలిస్తామని తెలిపారు.మరోవైపు, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)కు సంబంధించిన నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకున్నామని ఎన్నికల సంఘం తన అఫిడవిట్‌లో పేర్కొంది. ఫారం-6ను మూడు సర్ ఉత్తర్వుల ద్వారా మార్చారన్న ఆరోపణను కూడా తోసిపుచ్చింది.ఎన్నికల సంఘం పనితీరులో పారదర్శకత, ఓటర్ల జాబితా నిర్వహణకు ఉపయోగించే జు=ాచీజు వ్యవస్థలో అధికారాల కేంద్రీకరణ, ఓటర్ల పేర్ల నమోదు, తొలగింపులపై ఈ పిటిషన్లు దాఖలయ్యాయి. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అభ్యంతరాలను పట్టించుకోకుండా కొన్ని నిర్ణయాలు తీసుకున్నారంటూ గతంలో వచ్చిన వార్తల నేపథ్యంలో ఈ వివాదం మరింత చర్చనీయాంశమైంది. అయితే, 'సర్'కు సంబంధించిన తుది నిర్ణయాలు ఏకగ్రీవంగానే తీసుకున్నామని ఈసీ స్పష్టం చేసింది.

గ్రావిటీతో నీళ్లిస్తే రాజీనామా చేస్తా: ప్రభుత్వానికి హరీశ్‌రావు సవాల్

మొదటిపేజీ తరువాయి

అని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వానికి బహిరంగ సవాల్ విసిరారు. గ్రావిటీతో నీళ్లు వస్తాయని ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని ఆయన మండిపడ్డారు.రాష్ట్రంలో నెలకొన్న కరవుకు ప్రభుత్వ వైఫల్యమే కారణమని హరీశ్ ఆరోపించారు. "ఇది కాలం తెచ్చిన కరవు కాదు. కాంగ్రెస్ తెచ్చిన కరవు" అని ఆయన వ్యాఖ్యానించారు. కృష్ణా, గోదావరిలో నీరు అందుబాటులో ఉన్నా ఎత్తిపోతలు చేపట్టకుండా ప్రభుత్వం రైతులను నష్టపరుస్తోందని విమర్శించారు. 33 శాతం వర్షపాతం లోటు ఉన్న ఏపీలో లేని క్రాప్ హాలిడే, కేవలం 17 శాతం లోటు ఉన్న తెలంగాణలో ఎందుకు ప్రకటించారని ప్రశ్నించారు.ప్రభుత్వం తక్షణమే మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు చేపట్టి, కన్నెపల్లి పంపుహౌస్ నుంచి నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి రూ.25 వేల కోట్లు ఖర్చు చేస్తామంటున్నారని, అసలు ఆ ప్రతిపాదనకు సంబంధించిన డీపీఆర్‌ను ఎందుకు బహిర్గతం చేయడం లేదని నిలదీశారు. తుమ్మిడిహెట్టి వద్ద తగినంత నీటి లభ్యత లేదని కేంద్ర జల సంఘం స్పష్టం చేసిన తర్వాతే, తమ ప్రభుత్వం మేడిగడ్డ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టిందని ఆయన గుర్తుచేశారు.

రాష్ట్రం పిచ్చోడి చేతిలో రాయిలా మారింది: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

"రాష్ట్రం ప్రస్తుతం పిచ్చోడి చేతిలో రాయిలా మారింది. ఏ ఒక్క వర్గానికీ న్యాయం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది" అని కేటీఆర్ మండిపడ్డారు. రోమ్ నగరం తగలబడుతుంటే చక్రవర్తి ఫిడేల్ వాయించినట్టుగా, రాష్ట్రంలో కరవు ఉంటే ప్రభుత్వం మూసీ సుందరీకరణ పనులకు టెండర్లు పిలుస్తోందని ఎద్దేవా చేశారు. మరో ఏడాదిన్నరలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని, ప్రజలు ఓపిక పట్టాలని కోరారు.అయితే కేటీఆర్ ఆరోపణలను కాంగ్రెస్ నేతలు ఖండించారు. కేటీఆర్ వి దొంగ కన్నీళ్లని, గోదావరి జలాలను వృథా చేయడం లేదని, ఇతర ఎత్తిపోతల పథకాల ద్వారా వినియోగిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద నీటిమట్టం తక్కువగా ఉన్నందున పంపులను నడపడం సాధ్యం కాదని వారు స్పష్టం చేశారు.

కేటీఆర్, హరీశ్ రావు భ్రమల్లో ఉన్నారు

మొదటిపేజీ తరువాయి

క్షేత్రస్థాయిలో తమ పార్టీ బలంగా ఉందని చెప్పారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని... దేశంలో ఎక్కడా లేనంతగా తమ పార్టీలో సమన్వయం ఉందని మహేశ్ గౌడ్ తెలిపారు. నవంబర్‌లో అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, ఆ తర్వాత తమ ప్రత్యక్ష లక్ష్యం ఎన్నికలేనని స్పష్టం చేశారు. రాబోయే కాలంలో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశమే లేదని, ఆ పార్టీ పని అయిపోయిందని జోస్యం చెప్పారు. ప్రస్తుతం ఉన్న 8 ఎంపీ సీట్లలో రెండు కూడా గెలవడం కష్టమేనని.. మరోవైపు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలలో ఒక్కరు కూడా గెలవరని అన్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో 40 శాతం సీట్లు తమకే వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

TGTEL/26/A5513 వార్త దీపిక

ట్యాంకర్ల ద్వారా బీర్ల ఫ్యాక్టరీకి నీటి సరఫరా

అధికారులు ఇంత నిర్లక్ష్యమా..?

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి, అక్టోబర్ 27, వార్త దీపిక న్యూస్ :

తాగునీటి కొరత వేళ ట్యాంకర్ల ద్వారా బీర్ల పరిశ్రమలకు నీటిని సరఫరా చేస్తున్నారని, ఈ విషయంపై అధికారుల నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి, భవిష్యత్తులో నీటి వనరుల ఒకవైపు ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు వ్యవసాయ బోర్ల నుంచి నీటిని ట్యాంకర్ల ద్వారా పరిశ్రమలకు తరలిస్తున్నారని ఆయన ఆరోపించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా సమీక్షా సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు. జిల్లాలో తాగునీటి సరఫరా, వ్యవసాయ బోర్ల వినియోగం, పరిశ్రమలకు నీటి తరలింపు, భూసేకరణ పరిహారం వంటి అంశాలను సమీక్షలో చర్చించారు. ప్రజల దాహార్తిని తీర్చడానికి సరిపడా నీరు లేదని చెబుతున్న అధికారులు, గ్రామాల పరిధిలోని వ్యవసాయ బోర్ల నుంచి ట్యాంకర్ల ద్వారా పరిశ్రమలకు నిరంతరాయంగా నీటిని తరలిస్తున్న వ్యవహారంపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వ్యవసాయ విద్యుత్‌ను వినియోగించుకుంటూ బోర్ల నుంచి నీటిని తోడిపోసి ట్యాంకర్లను నింపుతున్నారని, ఈ వ్యవహారం అధికారులకు తెలిసే జరుగుతోందన్న ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. వ్యవసాయ అవసరాల కోసం ఏర్పాటు చేసిన బోర్ల నీటిని ఇతర అవసరాలకు పెద్దఎత్తున తరలిస్తే భూగర్భ జలమట్టాలు మరింత పడిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో తాగునీటి అవసరాలను పక్కనపెట్టి పరిశ్రమలకు నీటిని సరఫరా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి



వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని, నీటి వనరుల దుర్వినియోగాన్ని అరికట్టి ప్రజలకు సకాలంలో తాగునీరు అందించేలా సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

బలవంతపు భూ సేకరణ చేయడం సరి కాదు..!

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి, అక్టోబర్ 27, వార్త దీపిక న్యూస్ :

ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న కీలక సమస్యలపై సమగ్రంగా చర్చించకుండా, ప్రభుత్వ గొప్పలు చెప్పుకోవడానికే ప్రాధాన్యత ఇచ్చారని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ విమర్శించారు. ఈ సమావేశానికి మీడియాను అనుమతించకపోవడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. మీడియాకు అవకాశం కల్పిస్తే ప్రజా సమస్యలపై ప్రశ్నలు అడుగుతారని, ప్రభుత్వ వైఫల్యాలు బయటపడతాయని భయపడుతున్నారని, ప్రజలకు ఉపయోగపడే అంశాలపై చర్చించి, సమస్యలకు పరిష్కారాలు చూపాల్సిన సమావేశాలు కేవలం ప్రభుత్వ ప్రచార వేదికలుగా మారకూడదని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు, అసైన్డ్ భూముల హక్కులు, కరువు నివారణ, సింగూరు నీటి నిర్వహణ వంటి కీలక అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానాలు లేవని స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేయడం మానుకుని, ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.



రక్తదానం చేయండి.. ప్రాణదాతలుగా నిలవండి..!



పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాల్లో రక్తదాన శిబిరం

పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ విద్యార్థులకు అవగాహన

అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి

సంగారెడ్డి, అక్టోబర్ 27, వార్త దీపిక (న్యూస్

ప్రతినిధి):

పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆర్ముడ్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరం, ఓపెన్ హౌస్ కార్యక్రమాలను నిర్వహించినట్లు అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం ఈ నెల21 నుంచి 31 వరకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు యువకులు, వివిధ సంఘాల ప్రతినిధులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయడం సంతోషకరమన్నారు. ఈ శిబిరంలో మొత్తం 32 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు అదనపు ఎస్పీ తెలిపారు.ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. మనం



చేసే రక్తదానం ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలను కాపాడుతుందని అన్నారు. కులమత భేదాలు లేని రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయడం సాధ్యం కాదని, అందుకే రక్తదానానికి ఎంతో విలువ ఉందని తెలిపారు. రక్తదానం చేసి ప్రాణాలను కాపాడే ప్రాణదాతలుగా నిలవాలని సూచించారు.

విద్యార్థులకు పోలీసు విధులపై అవగాహన..

ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పోలీసు శాఖ విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించడం జరిగింది. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నిర్మూలన, మహిళల భద్రతలో షీ టీమ్స్ పాత్ర, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ పనితీరు, ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ వంటి అంశాలను ఆయా విభాగాల సిబ్బంది విద్యార్థులకు వివరించారు.మహిళలపై వేధింపులు జరిగినప్పుడు జిల్లా షీ టీమ్ నంబర్ 8712656772కు సమాచారం అందించాలని, మహిళలు షీ-సేఫ్ అప్లికేషన్ను వినియోగించుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు కాల్ చేసి పోలీసుల సహాయం పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి డీఎస్పీ సత్యయ్య గౌడ్, డీసీఆర్బీ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సైబర్ సెల్ డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నరేందర్, ఇన్‌స్పెక్టర్లు సదానాగరాజు, నాగేశ్వర్ రావు, నగేష్, రవీందర్, పోలీసు వైద్యాధికారి డాక్టర్ జ్యోతి, ఆర్ఐలు సురేష్ నాయక్, రాజశేఖర్ రెడ్డి, డానియెల్, శ్రీనివాస్ రావు, పోలీసు సిబ్బంది, బ్లడ్ బ్యాంకుకు చెందిన రాజు, విజయ్, పట్టణ యువత తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు ఎమ్మెల్యే పరిశీలన

తాండూర్, అక్టోబర్ 27, వార్త దీపిక న్యూస్ :

పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని 19,20, 21,22,23, 24 వార్డుల్లో నిర్వహించిన స్వచ్ఛ, స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పాల్గొని క్షేత్రస్థాయిలో పర్యటన పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. గొల్ల చెరువును ప్రాంతంలో పర్యటించి క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ఆయా వార్డులు పర్యటించి మురుగు కాలువల శుభ్రత చెత్త సేకరణ రోడ్డు వీధుల పరిశుభ్రత దోమల నివారణ చర్యలు తదితర అంశాలను దగ్గరుండి పరిశీలించారు, స్థానిక సమస్యలను ప్రజలకు అడిగి తెలుసుకున్నారు వాటి పరిష్కారానికి తీసుకోవలసిన చర్యలపై అధికారులకు వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ నిరజ బాల్ రెడ్డి, కమిషనర్ రాకేష్, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్,వాడు కౌన్సిలర్లు అధికారులు సీనియర్ నాయకులు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.







సురక్షిత బచ్పన్ అభ్యాన్ కార్యక్రమం

తాండూర్, అక్టోబర్ 27, వార్త దీపిక న్యూస్ :

విద్యార్థులు విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, జూనియర్ సివిల్ జడ్జ్ గిరిజాతిరందాసు సూచించారు బాలల హక్కులను తెలుసుకోవడంతోపాటు వాటికి భంగం కలిగినప్పుడు చట్టపరంగా ఎలా రక్షణ పొందచ్చో ప్రతి విద్యార్థి అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు. మంగళవారం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ నెం.1 పాఠశాలలో నిర్వహించిన సురక్షిత బచ్పన్ అభియాన్ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు,ఈ సందర్భంగా జడ్జ్ గిరిజాతిరందాసు మాట్లాడుతూ బాలల రక్షణకు సంబంధించి ప్రభుత్వం రూపొందించిన చట్టాలపై విద్యార్థులకు అవగాహన ఉండడం ఎంతో అవసరం అన్నారు. ముఖ్యంగా ఫోక్సో చెట్టశీ విద్యాహక్కు చట్టం బాల్య వివాహాల నిర్మూలన బాలల హక్కుల గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని సూచించారు. బాలలపై జరిగే నేరాలను అరికట్టడం వారికి సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం కోసం చట్టాలు కల్పిస్తున్న రక్షణ గురించి వివరించారు. విద్యార్థులు తమ హక్కులను తెలుసుకోవడంతో పాటు ఇతర హక్కులను కూడా గౌరవించాలని ఏదైనా సమస్య ఎదురైనప్పుడు తగిన సహాయం పొందేశీదుకు ముందుకు రావాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కే శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పాశం రవికుమార్, పానల్ న్యాయవాదులు జిలాని, అరుణ, పరమేశ్వరి, ముస్తాక్, దేవరాజ్, న్యాయవాదులు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్, అబ్దుల్ రెహమాన్, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులైన జర్నలిస్టులందరికి ఇంటి స్థలం ఇవ్వాలి..!

హెల్త్ కార్డు ఇవ్వకపోవడంతో రోడ్డున పడుతున్న జర్నలిస్టు కుటుంబాలు

అక్కడేషన్ కార్డులు తక్షణమే ఇవ్వాలి

మంత్రి పొంగులేటికి పియూడబ్ల్యూజే ఐజేయు వినతి

సానుకూలంగా స్పందించిన మంత్రి పొంగులేటి

సంగారెడ్డి, అక్టోబర్ 27, వార్త దీపిక న్యూస్ :

జిల్లాలో ఉన్న అర్హులైన జర్నలిస్టులందరికీ వెంటనే ఇంటి స్థలాలను మంజూరు చేయాలని రాష్ట్ర రెవిన్యూ ,హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డిని టియుడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షు యాదగిరి అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ లో మంత్రి పొంగులేటి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా



సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం టియుడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి ఆధ్వర్యంలో సంఘ నేతలు మంత్రికి వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు కావస్తున్నదని, ఇప్పటి వరకు జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించలేదని ఈ సందర్భంగా బండారు యాదగిరి పేర్కొన్నారు. తక్షణమే అర్హులైన వారి జాబితాన్ని సేకరించి, ఇంటి స్థలాలను మంజూరు చేయాలని కోరారు. అంతేకాకుండా హెల్త్ కార్డులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా నగదు రహిత వైద్య సేవలను జర్నలిస్టులకు, వారి కుటుంబాలకు అందే విధంగా చూడాలని పేర్కొన్నారు. హెల్త్ కార్డులు ఇవ్వలేదని, పేద జర్నలిస్టులు, వారి కుటుంబాలు అనేక ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ ,హెల్త్ కార్డును ఇవ్వక పోవడం సమంజసం కాదని అన్నారు. దీనివల్ల జర్నలిస్టుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని బండారు యాదగిరి వివరించారు. ఇంకా అనేకమంది అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు అందలేదని వారికి కూడా అక్రిడేషన్ కార్డులను అందించాలని మంత్రికి మూడో డిమాండ్ గా విన్నవించారు. దీంతో మంత్రి వెంటనే స్పందించారు. హైదరాబాద్ జర్నలిస్టులకు ఇంటి స్థలాలను త్వరలో ఇవ్వబోతున్నామని చెప్పారు. ఆ తర్వాత జిల్లాలో అర్హులందరికీ ఇంటి స్థలాలను కచ్చితంగా ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయంలో నిశ్చింతగా ఉండాలని మంత్రి పొంగులేటి తెలిపారు. జిల్లాకు చెందిన మంత్రి రాజనర్సింహ కూడా సానుకూలంగా స్పందించారు. జిల్లా జర్నలిస్టుల సమస్యలను మంత్రి పొంగిలేటికి సంక్షిప్తంగా వివరించారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కూడా వేదికపై ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే, ఐజేయు నాయకులు రాజు నాయక్, హెచ్ఎంటీవీ శ్రీనివాస్, బాలయ్య, శ్రీకాంత్, ఫోటో జర్నలిస్టుల సంఘ అధ్యక్షుడు ఆరిఫ్, తదితరులు పాల్గొన్నారు.



TGTEL/26/A5513 వార్త దీపిక

త్వరలోనే నిరుపేదలకు గుడ్ న్యూస్..!

తాండూర్, అక్టోబర్ 27, వార్త దీపిక న్యూస్ :

నిత్యవసర వస్తువుల ధరలతో సతమతమవుతున్న పేద కుటుంబాలకు త్వరలోనే ఉరుట లభించునుంది రేషన్ దుకాణాల ద్వారా బియ్యంతో పాటు మరిన్ని నిత్యావసర సరుకులు అందుబాటులోకి వస్తాయా? ప్రస్తుతం మార్కెట్లో సన్న బియ్యం పప్పులు నూనె వంటి సరుకులు కొనుగోలుకు అత్యంత ఖర్చు చేయాల్సి వస్తుంది ఈ నేపథ్యంలో ఈ అంశం ప్రాధాన్యం సంతరించుకుంది. రేషన్ వ్యవస్థ ద్వారా అదనపు సరుకులు అందితే పేద కుటుంబాలను నెలవారి ఖర్చులకు కొంత ఉపశమనం లభించే అవకాశం ఉంది. ప్రస్తుతం రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్నారు. అయితే నిత్యావసర ధరల ప్రభావంతో కుటుంబ బడ్జెట్ను భారం అవుతున్న వీళ్ళ రేషన్ ద్వారా ఇతర ముఖ్యమైన సరుకులు కూడా అందుకే తమకు ప్రయోజనం కలుగుతుందని పేద కుటుంబాలు ఆశిస్తున్నాయి. రోజువారి కూలీలు చిరుధాన్యాలు తక్కువ ఆదాయంఇలాంటి పరిస్థితుల్లో రేషన్ ద్వారా అదనపు సరుకులు అందితే కుటుంబాలకు ఆర్థికంగా కొంత వెసులుబాటు కలిగే అవకాశం ఉందని మొత్తానికి రేషన్ షాపులో బియ్యంతో పాటు మరిన్ని నిత్యవసర సరుకులు అందుతాయని అంశంపై ఆసక్తి నెలకొంది. పెరుగుతున్న ధరల నుంచి పేదలకు నిజంగా ఊరట లభిస్తుందా అదనపు సరుకుల పంపిణీ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది అన్నది అధికారిక ప్రకటనతోనే స్పష్టమవుతుంది



ప్రధాని మోదీ పట్ల అనుచిత వాఖ్యాలు మానుకోవాలి

తాండూర్, అక్టోబర్ 27, వార్త దీపిక న్యూస్ :

భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తండ్రి గురించి అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున కరిగే దిష్టిబొమ్మ దగ్ధం చేసే నిరసన తెలిపారు. అనంతరం కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షులు యు రమేష్ కుమార్, నాయకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి జిల్లా బీజేపీ నాయకులు అందరూ పాల్గొన్నారు.



ఓటమి అక్కసుతోనే తమపై అసత్య ప్రచారాలు

- కల్లెపల్లి అశోక్, శ్రావణ్, నవీన్

వార్త దీపిక న్యూస్

మండలంలోని రాఘవపూర్ మాజీ సర్పంచ్ ఆడెపు వెంకటేష్ తమపై చేస్తున్న అసత్య ఆరోపణలను ఖండిస్తూ రాఘవపూర్ గ్రామస్తులు కల్లెపల్లి అశోక్, మోదుంపల్లి శ్రావణ్, కుమ్మరి నవీన్లు పెద్దపల్లి లో నిర్వహించిన మీడియా సమావేశంలో తీవ్రంగా మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్థానిక ఎన్నికల్లో ఓడిపోయిన అక్కసుతోనే తమపై బురదజల్లుతూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, తమకు ఇల్లు కట్టించానని, బైక్ కొనిచ్చానని అబద్ధాలు చెప్తున్న వెంకటేష్ తన ఇంటి నిర్మాణంలో ఒక్క వీఎస్ఆర్ ఇటుక ఉన్నట్లు నిరూపించినా ఇంటిని తామే స్వయంగా కూల్చి వే స్తామని సవాల్ విసిరారు. కిరాణా దుకాణం కోసం భార్య పుస్తెలతాడు తాకట్టు పెట్టి, లోన్ తీసుకుని సొంత కష్టంతో బతుకుతుంటే, డబ్బులు ఇచ్చానంటూ తప్పుడు మాటలు మాట్లాడటం సిగ్గుచేటన్నా రు. చెరువు శిఖం భూముల కబ్జా, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై నిలదీస్తున్నం దుకే తమపై కక్షగట్టి అక్రమ కేసులు, గంజాయి పేరిట అసత్య ఆరోపణలు మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ఆరోపణలకు కట్టుబడి ఉంటే పోచమ్మ గుడి వద్ద ప్రమాణానికి రావాలని, లేనిపక్షంలో నిరాధార ఆరోపణలు చేసినందుకు గాను న్యాయపరంగా పరువునష్టం దావా వేస్తామని వారు హెచ్చరించారు.



హెచ్ఆర్పిసి జిల్లా ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్ మాలిక్ నియామకం

వార్త దీపిక న్యూస్

హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎండీ.అబ్దుల్ మాలిక్ నియమితులయ్యా రు. ఈ మేరకు కమిటీ రాష్ట్ర నాయకత్వం ఆయనకు అధికారిక నియామక పత్రాన్ని అందజేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.ఈ సందర్భంగా ఎండీ.అబ్దుల్ మాలిక్ మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణ కమిటీ జిల్లా ప్రధాన కార్యద ర్శిగా తనను నియమించిన రాష్ట్ర కమిటీ బాధ్యులకు, జిల్లా నాయకు లకు ందించి బాధితులకు న్యాయం జరిగేలా చట్టపరం గా అండగా నిలుస్తామని తెలిపారు. సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జిల్లావ్యాప్తంగా కమిటీని మరింత పటిష్టం చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. వి ద్యావంతుడు, యువకుడు అయిన ఎండీ.అబ్దుల్ మాలిక్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టడం పట్ల స్థానిక మేధావులు, యువజన సంఘాల ప్రతినిధులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, మిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

పనితీరులో మార్పు... కఠినచర్యలు తప్పవ్





భూ సమస్యల పరిష్కారంలో జాప్యంమొద్దు..!

రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సంగారెడ్డి, అక్టోబర్ 27, వార్త దీపిక న్యూస్ :

రెవెన్యూ ఉద్యోగులు సక్రమంగా, బాధ్యత యుతంగా పనిచేసినప్పుడే ప్రజల ముఖ్యంగా రైతుల సమస్యలు తీరుతాయని ఈ విషయంలో ఇప్పటికే పలుమార్లు రెవెన్యూ ఉద్యోగులను ఆదేశించినప్పటికీ పూర్తిస్థాయి ఫలితాలు కనిపించలేదని భవిష్యత్తులో మార్పురాకపోతే అధికారులు, ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఉమ్మడి మెదక్ జిల్లాలోని రెవెన్యూ, రిజిస్ట్రేషన్, హౌసింగ్ శాఖల పనితీరుపై సంగారెడ్డి జిల్లా పరిషత్ మీటింగ్ హాలు లో ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో మంత్రులు దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి లతో కలిసి మంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు భూ రికార్డుల్లో పారదర్శకత తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం రీ సర్వే చేపట్టిందన్నారు. ఏడాదిన్నరలోపు వ్యవసాయ భూములతో పాటు ఆబాదీ ఆస్తుల రీ సర్వేను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే కొనసాగుతోందని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కేటాయింపులు వేగవంతంగా, పూర్తి పారదర్శకంగా, అర్హత ప్రాతిపదికన జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీక్షకు ముందు పలువురు ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాల్లో నెలకొన్న భూ సమస్యలు, డబుల్ బెడ్రూమ్ ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులకు సంబంధించిన అంశాలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు సంబంధిత జిల్లా కలెక్టర్లకు మంత్రి పలు సూచనలు చేశారు. ప్రజాప్రతినిధులు అందించిన సలహాలు, సూచనలను స్వీకరించారు. ఈ సమావేశంలు4సి సి ఎల్ ఎ కమీషనర్ లోకేష్ కుమార్, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ స్పెషల్ సెక్రటరీ రాజీవ్ గాంధీ హన్మంత్, గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్, ఎంపీ. రఘునందన్ రావు, సురేశ్ షెట్కర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సునీతా లక్ష్మారెడ్డి, మాణిక్రావు, కొత్త ప్రభాకర్ రెడ్డి, సంజీవరెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల కలెక్టర్లు ప్రతీక్ జైన్, హైమావతి, ప్రతిమా సింగ్లతో పాటు అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సురక్షిత బాల్య అభియాన్"పై కృష్ణవేణి పాఠశాలల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం





వార్త దీపిక న్యూస్ :

బాలల రక్షణ, భద్రత, హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా మండల న్యాయ సేవల కమిటీ, గోదావరిఖని వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "సురక్షిత బాల్య అభియాన్" కార్యక్రమంలో భాగంగా క్రిష్ణవేణి పాఠశాలలు -- గోదావరిఖని మరియు ఏస్టీపీసీ శాఖల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గోదావరిఖని జూనియర్ సివిల్ జడ్జి ఆర్. స్వారిక, అడ్వకేట్ ఎం.డి. ఉమర్, గోదావరిఖని పోలీస్ స్టేషన్--1 సబ్ ఇన్స్పెక్టర్ కె. రాజశేఖర్, పలువురు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు విద్యార్థులకు బాలలపై లైంగిక నేరాల నుంచి రక్షణ చట్టం--2012 (ూజూూ ూూష్) గురించి అవగాహన కల్పించారు. బాలల హక్కులు, వ్యక్తిగత భద్రత, అనుచిత ప్రవర్తనను గుర్తించడం, ఆపద సమయంలో ధైర్యంగా సహాయం కోరడం వంటి అంశాలను వివరించారు. పిల్లల రక్షణలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసు శాఖ, న్యాయ వ్యవస్థ సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని తెలియజేశారు.విద్యార్థులు తమ వ్యక్తిగత భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినప్పుడు భయపడకుండా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు లేదా నమ్మకమైన పెద్దలకు తెలియజేయాలని సూచించారు. బాలలపై జరిగే నేరాలను నిరోధించడంలో సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పేర్కొన్నారు.క్రిష్ణవేణి పాఠశాలల్లో విద్యార్థులకు సురక్షితమైన, భయరహితమైన విద్యా వాతావరణాన్ని కల్పించడంతో పాటు, వారిలో ఆత్మవిశ్వాసం, సామాజిక బాధ్యత, హక్కుల పట్ల అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పాఠశాల యాజమాన్యం తెలిపింది.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు బాలల భద్రతపై అవగాహన పెంపొందించడంతో పాటు, ప్రతి చిన్నారి హక్కులను గౌరవిస్తూ వారి సురక్షిత భవిష్యత్తుకు బాటలు వేయాలనే సందేశాన్ని అందించారు."బాలల భద్రత

రైతులకు ఎల్ఎనినో ప్రభావంపై అవగాహన కల్పించాలి

రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

వార్త దీపిక న్యూస్ , :

రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఈరోజు గోదావరిఖని స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాలకుర్తి, అంతర్గాం మండలాల సర్పంచులు, ముఖ్య నాయకులతో సమావేశమ య్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎల్ఎనినో ప్రభావంతో రాబోయే రోజుల్లో నీటి లభ్యతపై ప్రభావం పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని రైతులను ముందస్తుగా అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రతి రైతుకు పరిస్థితులను అర్థమయ్యేలా వివరించి, నీటిని పొదుపుగా వినియోగించుకోవడం, చెరువులు, కుంటలను సంరక్షించడం, ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఎస్ఆర్ఎస్పీ నుంచి 4.5 టీఎంసీల నీటిని విడుదల చేసిన నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు.ఎల్ఎనినోను ముఖ్యమలకు అండగా నిలిచే బాధ్యతను తాము తీసుకుంటామని, మంత్రి శ్రీధర్ బాబు , ప్రభుత్వ విప్ విజయ రమణారావు తో కలిసి అవసరమైన చర్యలకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.రామగుండం నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రాధాన్యం ఇస్తూ ఒక్కో గ్రామానికి సుమారు 130 ఇళ్ల వరకు మంజూరు చేశామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలందరికీ చేరేలా నాయకులు కృషి చేయాలని సూచించారు.ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ రహదారుల నిర్మాణంతో పాటు పంచాయతీరాజ్ రోడ్ల పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయి ప్రజల సొమ్మేనని, నిధులు ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులకే వినియోగించేలా పర్యవేక్షించాలని కోరారు."ప్రజల సంక్షేమం, రైతుల భద్రత, గ్రామాల అభివృద్ధే మా లక్ష్యం. ప్రతి గ్రామానికి రాజ్ ఠాకూర్ వస్తాడు.. ప్రజల





సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తాడు అని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో పాలకుర్తి, అంతర్గాం మండలాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

Printed, published & Owned by erlla pavan kumar, printed at Saketh Publications, #sy. No-312, Trinetra comples Sangareddy, Telangana -502001.Editor erlla pavan kumar, Rni Regn. No.TG TEL/26/A5513.Email:pavanerla@gmail.como.offic:4-7-25b/h.balajinagar sangareddy :cell:9666466984